
సాక్షి
గుంటూరు
గురువారం । 15 । మే । 2025



పండ్ల తోటలపై శిక్షణ

వినుకొండ: పండ్ల తోటలపై రైతులకు శిక్షణను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. హార్టికల్చరల్ ఆఫీసర్ నజీర నూల్, ఏవో జి.వరలక్ష్మి పాల్గొన్నారు.



నేడు ప్రతిష్ట మహోత్సవం

తాడేపల్లి రూరల్: ఉండవల్లి దళిత వాడలో క్రీస్తు కృప లూథరన్ దేవాలయం ప్రతిష్ట మహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించనున్నారు. ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి.



హుండీ కానుకలు లెక్కింపు

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. రూ.14.28 లక్షలు వచ్చినట్లు ఏవో తెలిపారు.

పేదల ఇళ్లపై వాలిన గద్ద

- తెనాలిలో లబ్ధిదారుల నుంచి రూ.1.70 కోట్లకు పైగా దళారి వసూలు
- ఇళ్లు నిర్మిస్తానని డబ్బులు వసూలు చేసి పరారీ
- మోసపోయామని బాధితుల ఆవేదన
- ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు వినతి

తెనాలి అర్బన్: గత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహనరెడ్డి హయాంలో పేదలకు గృహ యోగం కల్పించారు. జగనన్న కాలనీల పేరుతో ఊళ్లకు ఊళ్లు వెలిశాయి. పేదల సొంతింటి కల నెరవేరింది. తలదాచుకోవడానికి నిలువనీడ దొరుకుతుందని ఆశ పడ్డారు. వారి ఆశను ఓ దళారి సొమ్ము చేసుకున్నాడు. ఇళ్లు కట్టించి పెడతానని ఆశ చూపాడు. సగం సగం కట్టి మొహం చాటేశాడు. తెనాలి పట్టణం, మండల పరిధిలోని 23,718 మందికి పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, నేలపాడు, గోలిడొంక, బుర్రిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. వీటిలో తెనాలి పట్టణానికి చెందిన 9907 మంది, మండల పరిధిలో 1680 మంది ఉన్నారు. పేదలు ఇబ్బంది పడకూడదని ఆనాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నివాస స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించింది. దీనిలో భాగంగా తెనాలి పరిధిలో మొదటి విడత కింద 11,587 మందిని ఎంపిక చేసింది.వారికి గత రూ.1.80 లక్షల నగదుతో పాటు 340 కేజీల ఇనుము, 90బస్తాల సిమెంట్, ఇసుకను సరఫరా చేసింది.



జగ్గడిగుంటపాలెంలో మధ్యలో ఆగిపోయిన జగనన్న కాలనీలో ఇళ్లు

కాంట్రాక్టర్ అవతారమెత్తిన దళారి

పేదల సొంతింటి కలను ఆసరాగా చేసుకుని తెనాలి పట్టణం 24వ వార్డుకు చెందిన ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స అధినేత ఎం. పున్నారావు కాంట్రాక్టర్ అవతారం ఎత్తాడు. ప్రభుత్వం ఇచ్చే నగదులో ఇళ్లు నిర్మిస్తానని చెప్పి బుర్రిపాలెం లేవుట్‌లో 180 మంది నుంచి రూ.50వేలను అడ్వాన్స్‌గా వసూలు చేశాడు. వాయిదాల రూపంలో ప్రభుత్వం ఇచ్చే నగదును ఇవ్వడంతో పాటు అదనంగా రూ.50వేలు ఇవ్వాలని అగ్రిమెంట్ చేసుకున్నాడు. 100 మంది లబ్ధిదారుల నుంచి బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేసిన రూ.1.97కోట్ల నిధులతో పాటు రూ.50లక్షల వరకు సొంత నగదు వసూలు చేశాడు. వీటిలో రూ.80లక్షల విలువ చేసే పనులు మాత్రమే చేసినట్లు ఆ శాఖ అధికారులు నిర్ధారించారు. ఇది కాకుండా మరో కాంట్రాక్టర్ వద్ద ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి రూ.లక్షలలో అడ్వాన్స్ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అజ్ఞాతంలో ఉన్న అతడిని పట్టుకోవడంతో తమకు న్యాయం చేయాలని బాధితులు తెలిపారు.



పున్నారావు చేసుకున్న అగ్రిమెంట్ కాపీ

రూ.2.50 లక్షలకు అగ్రిమెంట్



బుర్రిపాలెంలోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించి ఇస్తానని రూ.2.50 లక్షలకు పున్నారావు అగ్రిమెంట్ చేసుకున్నాడు. దీనిలో భాగంగా రూ.1.50లక్షలు తీసుకున్నాడు. ఇవి కాకుండా ప్రభుత్వం పంపిణీ చేసిన మెటీరియల్ కూడా తీసుకున్నాడు. మూడు సంవత్సరాలు దాటినా నిర్మాణం పూర్తి చేయలేదు.

– రామిశెట్టి దుర్గాంబ, నందులపేట, తెనాలి

అధికారులు చర్యలు తీసుకోవాలి



బుర్రిపాలెం లే అవుట్‌లో ఇల్లు నిర్మించి ఇస్తానని పున్నారావు నా దగ్గర రూ.1.30 లక్షలు తీసుకున్నాడు. పునాదులు వరకు వేశాడు. మిగిలిన పని చేయడం లేదు. ఫోన్ చేస్తే తీయడం లేదు. అధికారులు స్పందించి ఇల్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రామిశెట్టి బాలకృష్ణ, తెనాలి

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

పున్నారావు నగదు వసూలు చేసిన విషయం మా దృష్టికి వచ్చింది. లబ్ధిదారుల ఫిర్యాదును పోలీసు అధికారులకు పంపి కేసు నమోదు చేయాలని కోరాం. అతడ్ని పిలిపించి ఇల్లు కట్టించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– భాస్కర్, ఈఈ, గృహనిర్మాణశాఖ, తెనాలి

కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసిన ఉద్యోగికి షోకాజ్ నోటీసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న ఓ ఉద్యోగి కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ఐడీ కార్డ్ సృష్టించాడు. తనను పర్మినెంట్ చేయాలని హైకోర్టును ఆశ్రయించడంపై నగరపాలక సంస్థ అధికారులు షోకాజ్ నోటీసు సిద్ధం చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్స్ పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్న డి. దుర్గారావు 1998లో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన కె. సౌభాగ్యమ్మ(ఎఫ్ఎన్ఓ) ఎంప్లాయి ఐడీ నంబర్ 1070ను కార్యాలయ సిబ్బంది సహకారంతో సంపాదించాడు. ఆ ఐడీతో నకిలీ గుర్తింపు కార్డు సృష్టించి, దానిపై కమిషనర్ పులి శ్రీనివాసులు సంతకం ఫోర్జరీ చేయించాడు. తాను గత 25 ఏళ్లకు పైగా నగరపాలక సంస్థలో పని చేస్తున్నానని, తన సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టును ఆశ్రయించాడు. ఈ విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ అధికారులు కంగుతిన్నారు. దుర్గారావు నియామకమైన సమయంలో పులి శ్రీనివాసులు లేరని.. ఫోర్జరీ చేసి హైకోర్టును ఎందుకు ఆశ్రయించావో చెప్పాలని ఇంజినీరింగ్ అధికారులు షోకాజ్ నోటీసు సిద్ధం చేశారు. రెండు రోజుల కిందట నగరపాలక సంస్థ అధికారులు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు చేశారు. షోకాజ్ నోటీసు తీసుకునేందుకు దుర్గారావు అందుబాటులో లేనట్లు తెలిసింది. నకిలీ ఐడీ కార్డు సృష్టించి, అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన అతని పై పోలీసులు కేసు నమోదు చేశారు.

17న అండర్-19 యువకుల జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-19 యువకుల జిల్లా క్రికెట్ జట్టు ఎంపికను ఈనెల 17న నిర్వహించనున్నట్లు త్రిమెన్ కమిటీ సభ్యుడు మహతి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఉదయం 7.30 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నవంబర్ 1, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. సొంత కిట్‌తోపాటు వైట్ డ్రెస్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తీసుకురావాలని తెలిపారు.

న్యూస్‌రీల్

తెనాలిలో సదరం క్యాంప్ పునః ప్రారంభం



తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో-100, ఈఎన్‌టీ-50, సైక్రాటిక్ విభాగాలకు చెందిన 50 మంది వికలాంగులు పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా క్యాంప్ నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

పాలిసెట్‌లో 97.07 శాతం ఉత్తీర్ణత



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెల 30న జరిగిన పాలిసెట్-2025 ఫలితాల్లో గుంటూరు జిల్లాలో 97.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో బాలురను అధిగమించిన బాలికలు 97.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో పాలిసెట్‌కు హాజరైన 4,129 మంది విద్యార్థుల్లో 4,008 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 2,587 మంది పరీక్ష రాయగా, 2,497 మంది ఉత్తీర్ణులయ్యారు. 96.52 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు 1,542 మంది హాజరు కాగా, 1,511 మంది ఉత్తీర్ణులయ్యారు. 97.99 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అక్కల బిమల్ రాజేంద్ర 191వ ర్యాంకు, వేమా ప్రేమ్‌కుమార్ 285వ ర్యాంకు, కాకుమాను అన్యూన్య 326వ ర్యాంకు సాధించి జిల్లాలో టాపర్లుగా నిలిచారు.

హోమ్స్‌ను సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



గుంటూరు లీగల్: క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు బుధవారం గుంటూరులోని హోమ్స్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సందర్శించారు. దిశా వన్ స్టాప్ సెంటర్, శిశు గృహం, స్వధార్ హోమ్, లీమా డెఫ్ అండ్ డమ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడున్న అధికారులతో మాట్లాడారు. పిల్లలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, రూంలను పరిశీలించారు. దిశా వన్ స్టాప్ సెంటర్, స్వధార్ హోమ్‌లో మహిళలకు అందుతున్న సదుపాయాల గురించి వాకబు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రిజిస్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఫ్రీ లీగల్ ఎయిడ్, బాధిత మహిళలకు అందే పరిహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన అవసరం



గుంటూరు వెస్ట్: ప్రకృతి వైపరీత్యాలు, భారీ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కనీస అవగాహన ఉంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) షేక్ ఖాజావలి అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బుధవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు భయాందోళనకు గురికాకూడదని తెలిపారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంత వరకు నష్టం తగ్గించడం మాక్ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఫైర్ వస్తోందని తెలుసుకోవడానికి ముందుగా పొగను గుర్తించాలని, ఆ సమయంలో ఇంట్లో ఉన్నవారంతా బయటకు వచ్చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.లక్ష్మీకుమారి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులపై అపోహలు వీడండి

టౌన్ ప్లానింగ్ గుంటూరు రీజినల్ డెప్యూటీ డైరెక్టర్ మధుకుమార్

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన నూతన భవన నిర్మాణాల అనుమతులపై అనేక అపోహలున్నాయని, వాటిని వీడాలని టౌన్ ప్లానింగ్ విభాగ గుంటూరు రీజినల్ డెప్యూటీ డైరెక్టర్ మధుకుమార్ పేర్కొన్నారు. తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ముందుకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతరం పట్టణ పరిధిలోని పలు సచివాలయాలను పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన నూతన నిబంధనల వల్ల ఎటువంటి నష్టం లేదన్నారు. లైసెన్స్ సర్వేయర్లు కొందరు దీనిపై అపోహలు సృష్టించారని ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలో అన్ని చోట్లా ప్లాన్‌ల దరఖాస్తు ప్రక్రియ నిలచిపోయిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని పట్టణాల్లో ఫ్లెక్సీలు, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనధికార కట్టడాలపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ అయితే వారిపై కూడా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా తెనాలి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ జేపీ రెడ్డి, తెనాలి అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శివన్నారాయణ, వాణి, టీపీవో సాంబశివరావు పాల్గొన్నారు.



కమిషనర్ శేషన్నతో మాట్లాడుతున్న డీడీ



గత నెల 14న ఆకులన్నీ కోల్పోయి నిర్జీవంగా కనిపించిన రావిచెట్టు



బోసు రోడ్డులో పచ్చని ఆకులతో కళకళలాడుతున్న రావిచెట్టు

చిగురించిన ఆకుపచ్చ ఆశ

ఇదో అద్భుతమైన ప్రకృతి దృశ్యం...పట్టణ బోసు రోడ్డులో టౌన్ చర్చికి ఎదురుగా గల రావిచెట్టు ఇది. మూడు దశాబ్దాలుగా నిలబడే ఉంది. దాని కింద నడిచిన కాలాలెన్నో! అక్కడి నీడలో విశ్రమించిన వారెందరో! అయితే, ఈ చెట్టుకు మాత్రం తన జీవన గమనం ఎప్పుడూ ఒకేలా ఉంటోంది. ఏటా వర్షం, ఎండ, గాలి, చలిలో ఒకే విధంగా ఉండే చక్రం. గత సంవత్సరం ఏప్రిల్ 14కు అకస్మాత్తుగా చెట్టు కొద్దికొద్దిగా ఆకులన్నీ కోల్పోయింది. అది చెట్టుకి సహజమైన విశ్రాంతి. ప్రకృతితో గల అవినాభావ సంబంధంలో అదో చిన్న విరామం మాత్రమే. నెల రోజుల్లో, ఎవ్వరూ ఊహించనంత త్వరగా పచ్చని కోటు వేసుకుంది. కొత్త ఆకులు, కొత్త ఆశలు, కొత్త జీవం. ఇప్పుడు మళ్లీ 2025లో అదే సన్నివేశం. గత ఏప్రిల్ 14వ తేదీకి ఆకులన్నీ రాలాయి. మే నెల 14వ తేదీ వచ్చేసరికి, అదే చెట్టు మళ్లీ తన సహజ రూపాన్ని చూపింది. ప్రతి కొమ్మలోనూ ఆకులోనూ పచ్చదనం పునరుజ్జీవించింది. అలా చెట్టు ఏటా తన జీవన శైలిని కళ్లకు కడుతోంది. అది ఒక్క చెట్టుకే కాదు...మనిషికీ ఇదే వర్తిస్తుంది. కోల్పోయిన దశ తర్వాత జీవితం తిరిగి వెలుగు చూస్తుంది. గతి తప్పని చీకటి ఉన్నా.. ప్రకృతి తన క్రమ శిక్షణతో తిరిగి వెలుగు తెస్తుంది. మన జీవితం కూడా అలా సాగాలి...నమ్మకంతో, సహనంతో, మళ్లీ ముందుకు సాగాలనేది చెట్టు చెప్పే పాఠం. జీవితంలో ఎదురయ్యే కష్ట కాలాలకూ, నిరాశలకూ ఒక బలమైన ప్రతీక. తాత్కాలికంగా కోల్పోయిన వెలుగు, నిశ్చితంగా మళ్లీ వస్తుందన్న ఆశను అది సూచిస్తోంది. ఆకుపచ్చని ఆశ అది.

–తెనాలి

ఫ్లోరోసిస్ భూతంపై యుద్ధం

- జిల్లావ్యాప్తంగా ఉచితంగా వైద్య పరీక్షలు
- ఏడాదిలో 490 గ్రామాల్లో సర్వేతో బాధితుల గుర్తింపు
- 825 పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్షలు
- ఫ్లోరోసిస్ రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యుల సూచన



ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యాలయం


గుంటూరు మెడికల్: వయస్సుతో సంబంధం లేకుండా నేడు పలువురు ఫ్లోరోసిస్‌తో అనారోగ్యానికి గురవుతున్నారు. సమస్యను నియంత్రణలో పెట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా జిల్లా వ్యాప్తంగా వైద్య పరీక్షలు చేయిస్తోంది. ముఖ్యంగా జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేక సిబ్బందితో వైద్య పరీక్షలు చేయిస్తోంది. మందులు కూడా ఉచితంగా అందజేస్తోంది. ఫ్లోరోసిస్ సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వచ్చే ఇతర అనారోగ్య సమస్యలను పూర్తిగా కట్టడి చేయవచ్చు. ఫ్లోరోసిస్ మహమ్మారిని కట్టడి చేయడమే ధ్యేయంగా జరుగుతున్న స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ వినియోగించుకొని, వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు సూచిస్తున్నారు.

2013లో నివారణ కార్యక్రమం ప్రారంభం

ఫ్లోరోసిస్ బారిన పడకుండా ప్రజలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమాన్ని 2013లో ప్రారంభించింది. గుంటూరు జిల్లాలో ఈ కార్యక్రమం 2014 జూన్ నుండి అమల్లోకి వచ్చింది. ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో 2014 నుంచి నేటి వరకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి బాధితులను గుర్తిస్తూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి దంత ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ చేశారు.

ఫ్లోరోసిస్ రాకుండా జాగ్రత్తలు ఇవి

- ఫ్లోరైడ్‌తో కలుషితమైన నీటిని తీసుకోకూడదు.
- అధికంగా ఉన్న ప్రదేశాల్లో పండిన కూరగాయలు, పాలు, టీ, మాంస ఉత్పత్తులు తీసుకోకూడదు.
- బ్లాక్ టీ, సుపారి, రాక్ సాల్ట్, పాన్‌పరాగ్, పొగాకు వాడకూడదు.
- ఫ్లోరైడ్ కల్గిన టూత్ పేస్టులు, మౌత్‌వాష్ వాడరాదు.
- అల్యూమినియం పాత్రలను వంట చేసేందుకు వాడకూడదు.
- రక్షిత మంచినీటిని తాగాలి.
- పాలు, పెరుగు, జున్ను, బెల్లం, పచ్చటి ఆకు కూరలు,జీలకర్ర, మునగకాడలు, ఉసిరి, జామ, నిమ్మ, నారింజ, టమాటా, పప్పు ధాన్యాలు, చిరుదాన్యాలు, ఆకుకూరలు, వెల్లుల్లి, అల్లం, ఉల్లి తీసుకోవాలి.
- క్యారెట్, బొప్పాయి, చిలకడ దుంపలు ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణకు దోహదపడతాయి



అవగాహన కరపత్రం

490 గ్రామాల్లో ఫ్లోరోసిస్ ప్రభావం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 46 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 490 గ్రామాల ప్రజలు ఫ్లోరోసిస్ వ్యాధిబారిన పడి, అవస్థలు పడుతున్నారు.
- జిల్లాలోని నూజెండ్ల, వినుకొండ, ఏనుగుపాలెం, కొచ్చర్ల, రెడ్డిపాలెం, రొంపిచర్ల, బొల్లాపల్లి, శావల్యాపురం, ఈపూరు, కోటప్పకొండ, అత్తలూరు, 75 త్యాళ్లూరు, క్రోసూరు, అచ్చంపేట, రాజుపాలెం, చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అత్యధిక సంఖ్యలో బాధితులు ఉన్నారు.
- జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు 81 గ్రామాలు, పల్నాడు జిల్లాలో 409 గ్రామాలు కలిపి మొత్తం 490 గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించారు.
- 19,682 ఇళ్లను సర్వే చేశారు. 47,854 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 2,370 మంది అనుమానిత డెంటల్ ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడినట్లు నిర్ధారించారు.
- మెరుగైన వైద్య పరీక్షలు చేసి 509 మంది ఫ్లోరోసిస్ బారిన పడినట్లు తేల్చారు.
- ఉమ్మడి గుంటూరుజిల్లా వ్యాప్తంగా 825 పాఠశాలల్లో 24,612 మంది విద్యార్థులను పరీక్షించారు. ఇందులో 1,783 మంది అనుమానిత దంత ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్నట్లు గుర్తించారు. మెరుగైన వైద్య పరీక్షలు చేసి 974 మంది విద్యార్థులు ఫ్లోరిసిస్ బారిన పడినట్లు నిర్ధారించారు.

ఉచితంగా వైద్య పరీక్షలు



ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు వివరించి, బాధితులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాం. పాఠశాలల విద్యార్థులకు మందులు, విటమిన్ సీ బిళ్లలు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 3,504 మంది ఫ్లోరైడ్ బాధితులకు నెక్ బెల్ట్, నడుం బెల్ట్, వాకింగ్ స్టిక్, ఫ్లోల్డింగ్ టాయిలెట్ చైర్ కిట్‌ను ఉచితంగా అందించాం. వ్యాధిపై అవగాహన కలిగేలా 1,315 ప్రాంతాల్లో పోస్టర్లు అంటించాం. మెడికల్ ఆఫీసర్లు 42 మందికి, పారా మెడికల్ సిబ్బంది 84 మందికి, హెల్త్ వర్కర్లు 335 మందికి, ఆశా వర్కర్లకు 980 మందికి ఫ్లోరోసిస్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేలా నైపుణ్యం పెంపొందించాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, గుంటూరు

ఫ్లోరోసిస్‌తో అనర్థాలు



ఎముకల ఫ్లోరోసిస్‌తో కాళ్లు, చేతులు వంకరపోవడం, వెన్నుముక కట్టెల్లా బిగుసుపోవడం, కండరాలు, లిగమెంట్స్, కణజాలాలు, ఎర్ర రక్తకణాలు, వీర్య కణాలు, ఉదర భాగంలోని జీర్ణవ్యవస్థపై దీని ప్రభావం కనిపిస్తుంది. ఎముకలు పెలుసుబారిపోతాయి. దంత ఫ్లోరోసిస్ వల్ల పళ్లు పసుపు లేదా గోధుమ రంగు నుంచి నలుపుగా మారతాయి. ఫ్లోరోసిస్ నీటిని తాగడం వల్ల వెన్నుముకలో ఉండే లిగమెంట్స్ ఉబ్బిపోతాయి. వెన్నుముకపై నరాలు ఒత్తుకుని కాళ్ళు, చేతులు తిమ్మిర్లు వస్తాయి. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంటుంది. గర్భవతులకు పరీక్షలు చేయడం వల్ల పుట్టబోయే పిల్లలు ఫ్లోరోసిస్ బారిన పడకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ జి. నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **4,000** గరిష్టం : రూ. **6,000**

మోడల్ ధర రూ. **5,000**

–తెనాలి



పసుపు ధరలు

(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **2149**

కొమ్ములు : **544** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	11,500	11,000

కాయలు : **600** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	11,500	11,000

మొత్తం అమ్మకాలు : **1611.750** క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

12 నుంచి బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 12వ తేదీ నుంచి బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, 25వ తేదీ నుంచి రిఫ్రిజరేటర్ అండ్ ఏసీ సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణలను ప్రారంభించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వయో పరిమితి 19 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండాలని సూచించారు. శిక్షణ 30 రోజులు ఉంటుందని, ఈ కాలంలో ఉచిత భోజనంతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఫొటోస్టాట్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట లేదా 0863–2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

దౌత్య సంబంధాలు మరింత బలోపేతం

- కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్ఈ డాక్టర్ విల్బర్ కే. ఓచ్చిలో
- విజ్ఞాన్ యూనివర్సిటీని సందర్శించిన ఎనిమిది మంది కెన్యా దేశ ప్రతినిధులు



కెన్యా దేశ ప్రతినిధులతో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: భారత్–కెన్యా దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మసీ, బయో మెడికల్, స్కిల్ డెవలప్‌మెంట్, డ్రోన్ టెక్నాలజీతో పాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్ఈ డాక్టర్ విల్బర్ కే. ఓచ్చిలో అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కెన్యా దేశానికి చెందిన ఎనిమిది మంది ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ విల్బర్ కే. ఓచ్చిలో మాట్లాడుతూ తమ దేశంలో విద్యా అవకాశాలను మెరుగుపరచడం, సాంస్కృతిక మార్పిడిని సులభం చేయడం, కెన్యా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కెన్యాలో వ్యవసాయం, ఆహార సాంకేతికత, స్మార్ట్ అగ్రికల్చర్, బయో మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డ్రోన్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి రంగాల్లో పురోగతికి విజ్ఞాన్ యూనివర్సిటీ సహకారం కావాలని కోరారు. విజ్ఞాన్ అందించే అత్యాధునిక సాంకేతిక వనరులు, పరిశోధన ప్రమాణాలు, విద్యారంగ నైపుణ్యాలు కెన్యా యువతకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రత్యేకంగా డ్రోన్ సాంకేతికత, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులపై తమ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ కెన్యా ప్రభుత్వ అభ్యర్థనను యూనివర్సిటీ అధిక ప్రాధాన్యతగా పరిగణిస్తోందని చెప్పారు. త్వరలోనే విద్య, పరిశోధన, శిక్షణల పరంగా ద్వైపాక్షిక ఒప్పందాలు జరిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పి.ఎం.వి రావు, డీన్లు పాల్గొన్నారు.

కెపా'సిటీ'కి మించి ఇసుక రవాణా

- భారీ వాహనాల్లో తరలింపు
- పట్టించుకోని అధికారులు



తెనాలి చెంచుపేటలో ఇసుకతో వెళుతున్న వాహనం

తెనాలి: ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమించడంతో పాటు ఇసుక రవాణాలోనూ ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారీ వాహనాల్లో కెపాసిటీకి మించి రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. భారత్ బెంజ్, టాటా బెంజ్ వంటి భారీ వాహనాల్లో ఇప్పుడు ఇసుక రవాణా ఎక్కువగా జరుగుతోందని తెలిసిందే. వీటి కెపాసిటీ 17–18 టన్నులు మాత్రమే. ఇందుకు భిన్నంగా ఒక్కో వాహనంలో రూ.40 టన్నులు, అంతకుమించిన పరిమాణంలోనూ రవాణా చేస్తున్నారు. వాహనం బాడీకి పైన దాదాపు మీటరు ఎత్తులో లోడింగ్ చేస్తున్నారు. పైన పట్టా కప్పి మరీ గమ్యస్థానానికి రవాణా చేస్తున్నారు.

ఇసుక రవాణాతో అవస్థలు

ప్రతిరోజూ పరిమితికి మించిన లోడింగ్‌తో ఇసుక రవాణా వాహనాలు తెనాలి మీదుగా వెళుతున్నాయి. ఇసుక జారిపోతున్నా, వెనుక వచ్చే ద్విచక్రవాహన దారులకు ఇబ్బందిగా ఉంటున్నా ఎవరికీ పట్టటం లేదు. కొద్దిరోజుల కిందట వైకుంఠపురం దేవస్థానం సమీపంలోని రైల్వే లోబ్రిడ్జి వద్ద వాహనాల నుంచి ఇసుక జారిపోయి ప్రజలు ఇబ్బది పడ్డారు. కెపాసిటీ మించిన పరిమాణంతో ఇసుకను తరలిస్తున్న భారీ వాహనాలతో రోడ్లు, కల్వర్టులు దెబ్బతింటున్నాయి. తెనాలి పట్టణంలోంచి వాహనాలు ప్రతిరోజూ పట్టపగలే వెళుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

బులియన్ అమ్మకాల్లో నిబంధనలు తప్పనిసరి



బులియన్ మర్చంట్ అసోసియేషన్ నాయకులతో సమావేశమైన లీగల్ మెట్రాలజీ అధికారులు

నెహ్రూనగర్: బంగారు వస్తువుల అమ్మకాల్లో లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి తెలియజేశారు. పటన్ంబజార్‌లోని గుంటూరు బులియన్ జ్యుయలరీ అండ్ పాన్ బ్రోకర్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బులియన్ లావాదేవీల్లో మిల్లీగ్రామ్‌కు కూడా కచ్చితమైన వేయింగ్ మెషీన్ వాడాలని సూచించారు. బిల్లు క్యారెటేజ్ అనుగుణంగా ఉండాలని తెలిపారు. బంగారానికి గ్రాము ధర ఉండాలన్నారు. రాళ్లు పొదిగిన ఆభరణాల బిల్లులో బంగారానికి, రాళ్లకు వేరుగా, పరిమాణం, చెల్లించాల్సిన పైకం కూడా వేర్వేరుగా ఉండాలని సూచించారు. బంగారం వెయిట్ చూసే ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌ను ప్రతి సంవత్సరం విధిగా లీగల్ మెట్రాలజీ వారితో ధ్రువీకరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలేంరాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో 'సింగిల్' చిత్ర బృందం సందడి

నగరంపాలెం: గుంటూరు నగరంలో బుధవారం సింగిల్ చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర విజయోత్సవాన్ని పురస్కరించుకుని నటుడు విష్ణు, హీరోయిన్లు కేతికా శర్మ, ఇవానా, దర్శకుడు కార్తికరాజు, చిత్ర బృందం బుధవారం నగరంపాలెంలోని ఫోనిక్స్ మాల్ (మైత్రి) థియేటర్‌కు వచ్చారు. మొదటి ఆట ప్రదర్శనకు హాజరై ప్రేక్షకులను చిత్ర బృందం ఉత్తేజపరిచింది. చిత్రం ఎలా ఉందంటూ అడగ్గా, బాగుంది అంటూ ప్రేక్షకులు బదులిచ్చారు. నటుడు విష్ణు మాట్లాడుతూ సింగిల్ చిత్రం వినోదాత్మకంగా ఉందన్నారు. భారీ విజయాన్ని అందించినందుకు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి మంచి చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని చెప్పారు. హీరోయిన్లు కేతికా శర్మ, ఇవానా మాట్లాడుతూ మంచి విజయం అందించారని, ఈ చిత్రంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం విజయోత్సవ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో థియేటర్ యాజమాన్యం పాల్గొంది.

డాబా పైనుంచి పడి యువతి మృతి

ఫిరంగిపురం: సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు డాబా పైనుంచి యువతి కిందపడి మృతి చెందిన సంఘటన ఫిరంగిపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రసూల్‌పేటలో నివాసం ఉంటున్న సీహెచ్. జ్యోత్స్న వేళాంగిణి మేరి (17) నరసరావుపేటలోని ప్రైవేట కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సెలవులు కావడంతో ఇంటి వద్ద ఉంటోంది. మంగళవారం రాత్రి తల్లి, చెల్లితో భోజనాలు చేసిన తరువాత డాబా పై అంతస్తుపై పడుకునేందుకు వెళ్లారు. జ్యోత్స్న తల్లి వద్దనున్న ఫోన్ తీసుకుని స్నేహితురాలితో పిట్టగోడపై కూర్చుని మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కిందకు పడి పోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. జ్యోత్స్న చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. తండ్రి రాజేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో శవ పంచనామా చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

కమ్మ జన సేవా సమితిలో విద్యార్థినులకు ప్రవేశాలు



ప్రగతి పత్రాలను ఆవిష్కరిస్తున్న సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్, పున్నయ్య చౌదరి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు ఆశ్రయం పొందడానికి కమ్మ జన సేవా సమితిలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. కుందుల రోడ్డులోని కమ్మ జన సేవా సమితిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రగతి పత్రాల్ని ఆవిష్కరించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ వసతి గృహంలో ప్రవేశాలకు ఇంటర్, బీటెక్, డిగ్రీ, ఫార్మసీ, పీజీతో పాటు బీడీఎస్, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఈనెల 15 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిభ, పేదరికం ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నామమాత్రంగా వసూలు చేస్తున్న ఫీజు నుంచి ప్రతి విద్యార్థినికి రూ.వెయ్యి మినహాయింపు ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిభ, పేదరికం, తల్లిదండ్రులు లేని విద్యార్థినుల నడవడిక, వసతిగృహంలో క్రమశిక్షణతో మెలిగే విధానాన్ని గమనించి, పాలకవర్గం కమిటీ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థినులకు వార్షికోత్సవం రోజున ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.40 లక్షల ఉపకార వేతనాలు అందజేస్తామని వివరించారు. సంస్థ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దాదాపు 300 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.ఏడువేలు చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తున్నామని తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులో రూ.50 కోట్ల వ్యయంతో రెండు వేల మంది విద్యార్థినులకు వసతి కల్పించే సామర్థ్యంతో నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. సంస్థ కార్యాలయంతో పాటు కమ్మ జన సేవాసమితి.కామ్ సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను ఈనెల 29లోపు సమితి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 0863–2355471, 2260666 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరి, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, సభ్యులు ఘంటా పున్నారావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

చిన్నారి మేధావి ప్రదీప్ నారాయణకు అరుదైన గుర్తింపు



తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణకు మరో గౌరవం దక్కింది. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్‌వైడ్ ఫౌండేషన్ 'ఇంటర్నేషనల్ బెస్ట్ అచీవర్ అవార్డు' లభించింది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, ఎంఎస్ఎంఈ, నీతి అయోగ్‌ల సహకారంతో ఫౌండేషన్ ఇటీవల విశాఖపట్నంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇంటర్నేషనల్ సోషల్ అవార్డ్స్ ప్రదానోత్సవం నిర్వహించింది. ఇందులో ప్రదీప్‌నారాయణకు ఈ గౌరవాన్ని అందజేశారు. ప్రస్తుతం నాలుగేళ్ల వయసున్న చిన్నారి 23 నెలల వయసు నుంచే అద్భుత జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తున్నాడు. తొలుత 150 పైగా వస్తువులు, కూరగాయలు, పక్షుల పేర్లను చెప్పాడు. ప్రస్తుతం 500 పైగా జంతువులు, వాహనాలు, జెండాలు, ఆకారాలు, రంగులు, ఫలాలు, కూరగాయలు, శరీర భాగాలు, ఆటబొమ్మలు, వస్త్రధారణ వంటి విభిన్న అంశాలను గుర్తించి చెప్పగలిగిన ప్రతిభను సొంతం చేసుకున్నాడు. భారత జాతీయ గీతాన్ని కేవలం 52 సెకన్లలోనే శ్రద్ధగా పాడుతున్నాడు. ఇంతటి ప్రతిభకుగాను 10 జాతీయ, 11 అంతర్జాతీయ అవార్డులను అందుకున్నాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లయిన తల్లిదండ్రులు ఆ చిన్నారిలోని జ్ఞాపకశక్తిని గుర్తించి, తగిన శిక్షణనిస్తూ సంబంధిత వీడియోలను ప్రతిష్టాత్మక సంస్థలకు పంపుతూ వస్తున్నారు. ఆ క్రమంలోనే ప్రదీప్‌నారాయణకు అవార్డులు లభిస్తున్నాయి.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: జిల్లాలో అర్బన్ పీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్, ఫిజియోథెరపిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, డెంటల్ టెక్నీషియన్, ఎల్‌జీఎస్ ఉద్యోగాల నియామకాలకు 2024 డిసెంబరులో నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. సదరు నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును బుధవారం విడుదల చేశామని చెప్పారు. దానిపై అభ్యంతరాలుంటే ఈనెల 20న సాయంత్రం 5 గంటల్లోపు ధ్రువపత్రాలతో డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు. లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

పవర్ లిఫ్టర్ షానూన్‌కు సత్కారం



షానూన్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న మోహన్ శ్యాంప్రసాద్

తెనాలి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియన్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సహా నాలుగు పతకాలు సాధించిన మదిర షానూన్‌ను బుధవారం స్థానిక కేవీఐకే జిమ్‌లో సత్కరించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త, డబుల్ హార్స్ మినపగుళ్లు అధినేత మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ హాజరయ్యారు. షానూన్‌ను సత్కరించారు. ఆమె విజయాలు క్రీడాలోకానికి స్ఫూర్తినిచ్చేవని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. జిమ్ శిక్షకురాలు, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి మాట్లాడుతూ తెనాలికి చెందిన షానూన్ కేఎల్ యూనివర్సిటీలో బీఏఎస్ డిగ్రీ చదువుతూ, తెనాలి కేవీఐకే జిమ్‌లో సాధన చేస్తోందని చెప్పారు. రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలను సాధించిన తర్వాత తొలిసారిగా ఆసియా స్థాయి పోటీల్లో జూనియర్స్ విభాగంలో 47 కిలోల కేటగిరీలో పోటీ పడిందని తెలిపారు. రజత, మూడు కాంస్య పతకాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. కేవీఐకే స్పోర్ట్స్ అకాడెమీకి తొలి అంతర్జాతీయ పతకాన్ని అందించినట్టు తెలిపారు. అకాడమీ తరఫున కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్ పూసపాటి శివరామ కిరణ్‌రాజు, ఇతర లిఫ్టర్లు షానూన్‌ను సత్కరించారు.

సమగ్ర శిక్షలో వివిధ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ అధికారి (ఏఎస్ఓ), ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ పోస్టుల్లో ఫారిన్ సర్వీసు నిబంధనలపై పని చేసేందుకు ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 16లోపు దరఖాస్తు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 55 ఏళ్లలోపు వయస్సు కలిగిన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలు అర్హులని ఆమె పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఐదేళ్లు, ఎస్జీటీ కేడర్‌కు ఎనిమిదేళ్ల సర్వీసుతో మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులతో పీజీ, కంప్యూటర్స్‌లో గుర్తింపు పొందిన వర్సిటీ, విద్యాసంస్థల నుంచి పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా కలిగి ఉండాలని సూచించారు. అన్ని విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాల ఫొటోస్టాట్ కాపీలపై తాము పని చేస్తున్న అధికారితో సంతకం చేయించి, ఈనెల 16న సాయంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని సమగ్ర శిక్ష విభాగంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు సమగ్ర శిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్ సందర్శించాలని సూచించారు.

హెచ్‌ఐవీ మహిళలకు క్యాన్సర్ పరీక్షలు

ఏర్పాట్లపై నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో ఏపీ శాక్స్ అధికారుల పర్యటన



సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌తో సమావేశమైన ఏపీ శాక్స్ అధికారులు

నరసరావుపేట: స్థానిక ఏరియా వైద్యశాలలో హెచ్‌ఐవీతో జీవిస్తున్న మహిళలకు త్వరలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) విభాగంతో కలిసి ఎయిడ్స్ కంట్రోల్ అధికారులు దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ శాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.అంకినీడుప్రసాదు, డీడీ సీఎస్‌టీ డాక్టర్ చక్రవర్తి, పెప్‌ఫార్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాదు షేర్ ఇండియా అధికారులు డాక్టర్ జయకృష్ణ బుధవారం ఏరియా వైద్యశాలను సందర్శించి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, గైనకాలజీ విభాగ అధిపతులతో ఈ అంశంపై చర్చించారు. క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ చేయటం వలన హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి త్వరగా షుగర్, బీపీ, క్యాన్సర్ గుర్తించి ముందుగానే చికిత్స ప్రారంభించటం తద్వారా వారి జీవితకాలం పొడిగించే అవకాశం ఉన్నందున దీనికి కావాల్సిన సహాయసహకారాలు అందజేసేందుకు తాము సిద్ధమని హాస్పిటల్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ కె.ఏడుకొండలు, డాక్టర్ దయానిధి, గైనకాలజీ డాక్టర్ మంత్రూ నాయక్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద పాల్గొన్నారు.

పూలంగి సేవతో.. పవళింపుము స్వామీ!

- రంగనాథుడికి అంగరంగ వైభవంగా పుష్పయాగం
- సొలస ఆలయంలో ద్వాదశ ప్రక్షిణలు, పవళింపు సేవ



పూలంగి సేవకు పలు రకాల పుష్పాలను తెస్తున్న భక్తులు



బహుళ పుష్పాలంకార కృతుడైన రంగనాయక స్వామి

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో శ్రీభూ సమేత రంగనాయక స్వామి ఆలయం బుధవారం భక్తజనంతో కళకళలాడింది. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు కైంకర్యాల నిర్వహణ అట్టహాసంగా నిర్వహించారు. బుధవారం వేకువజామునే రంగనాథస్వామికి పలు రకాల పుష్పాలను భక్తులు మేళతాళాలతో భజాభజంత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అర్చకులు పర్చూరి రామకృష్ణమచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి, పూలంగి సేవలు అందించారు. హోమపూజల్ని ముగించారు. సాయంత్రం అత్యధిక మంది భక్తులు పాల్గొని ద్వాదశ ప్రదక్షిణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పవళింపు సేవ చేశారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఆయా కార్యక్రమాలను ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, అర్వపల్లి బ్రదర్స్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

యడ్లపూడి: మండలంలో బుధవారం సాయత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు బలంగా వీచాయి. కొద్దిపాటి వర్షం కూడా పడింది. మండలంలోని పోలూరు గ్రామంలో కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. చెట్టుపక్కన ఉన్న వరిగడ్డివామి కూడా కొద్ది మేర కాలిపోయింది. గ్రామం నడిబొడ్డున ఉన్న చెట్టుపై పిడుగుపడినా ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు ఆ శబ్దానికి భయపడిపోయారు. మంటలు చెలరేగకుండా ఆర్పివేశారు.



ఎండ భగభగ.. నీడకు పద పద..!

ఎండలు తీవ్రంగా ఉండటంతో మనుషులే కాదు.. మూగజీవాలు కూడా ఎక్కడ కాస్త నీడ దొరుకుతుందా.. అని వెళ్లి సేద తీరుతున్నాయి. రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేయడంతో పశువులకు మేత ఎక్కువగా ఉండటంతో పల్నాడు గ్రామాల నుంచి పశువులు వలస తీసుకొచ్చారు. చిత్రంలో చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో ఎండ వేళ చెట్టు కింద ఆవులు సేద తీరుతున్న దృశ్యం – చుండూరు(వేమూరు)